ఆనందం





సాక్షి ఎఫెక్ట్..

తిరుపతి నగరంలో రోడ్ల దుస్థితిపై ఈ నెల 4వ తేదీన సాక్షి పత్రికలో 'నెరవేరని మాట.. గుంతలుగా బాట' శీర్షికతో కథనం ప్రచురితమైంది. దీనిపై ఎట్టకేలకు అధికార యంత్రాంగం స్పందించింది. ఎంఎస్ సుబ్బులక్ష్మి కూడలి, లీలామహల్ సర్కిల్ వద్ద గుంతలను కాంక్రీట్‌తో పూడ్పించింది. ఈ మేరకు ప్రజానీకం హర్షాతిరేకాలు వ్యక్తం చేసింది. మిగిలిన రహదారులను సైతం మరమ్మతులు చేయిస్తే సౌకర్యంగా ఉంటుందని కోరింది. - సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

అలసత్వం



ప్రజాధనానికి జవాబుదారీగా వ్యవహరించాల్సిన రూ.85లక్షలు వృథాగా మారుతున్నా సర్కారు పట్టించుకోకపోవడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నిర్మించిందనే సాకుతో ఔషధ నియంత్రణ కార్యాలయ భవనాన్ని ప్రారంభించడం లేదు. అధికారులు పలుమార్లు ఆహ్వానించినా సంబంధిత మంత్రులు అలసత్వం వీడడం లేదు. కనీసం రిబ్బన్ కత్తిరించే ఓపిక కూడా తెచ్చుకోవడం లేదు. ఈ క్రమంలో భవనం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోతున్నాయి. లోపల కిటికీలు, తలుపులు దెబ్బతింటున్నాయి. గోడలు క్రమేణా శిథిలావస్థకు చేరుతున్నాయి. - తిరుపతి తుడా

క్లుప్తంగా

ఉద్యమ మద్దతుకు రైతుల వినతి



ఎంపీ గురుమూర్తికి వినతిపత్రం అందిస్తున్న నేతలు

తిరుపతి మంగళం : ఢిల్లీలో చేపట్టిన రైతు ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని రైతు సంఘాల నేతలు కోరారు. సోమవారం ఈ మేరకు ఎంపీ మద్దిల గురుమూర్తికి వినతిపత్రం అందించారు. 57 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న జగ్జీత్ సింగ్ దల్లేవాల్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘాల నేతలు పాటూరి వెంకటరత్నం, రామిశెట్టి వెంకయ్య, మాంగాటి గోపాల్ రెడ్డి, హేమలత, చలపతి, పద్మనాభ రెడ్డి కోరారు.

ఆర్థిక సాయం



చెక్కు అందిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: మంగళం పంచాయతీకి చెందిన చెంచయ్యనాయుడు అనే బాధితుడికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.2లక్షలను కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం అందించారు. ఈ మేరకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా రవి జన్మదినోత్సవం



రవిని సత్కరిస్తున్న నేతలు

తిరుపతి మంగళం : వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మగుంట రవి పుట్టిన రోజు వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు దుద్దేల బాబు, ఎస్‌కే బాబు, కృష్ణమూర్తి, నల్లాని బాబు, కట్టా గోపీయాదవ్, సోము, అబ్బు, జీఎంకే. చంద్ర, మోహన్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ విడుదల చేస్తున్న డీఎంహెచ్‌ఓ

తిరుపతి తుడా : మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆఫ్ తిరుపతి ఆధ్వర్యంలో ముద్రించిన 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను డీఎంహెచ్‌ఓ బాలకృష్ణ నాయక్ సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు వినయ్, హరి, శ్రీకాంత్, ప్రభు, గోపి, సుమన్ బాలాజీ పాల్గొన్నారు.

పల్లెల్లో పశువైద్య శిబిరాలు



పశువుకు మందు వేస్తున్న సర్పంచ్ సునీత

పాకాల : మండలంలోని అచ్చమ్మ అగ్రహారం, దామలచెరువు పంచాయతీ మొరవపల్లెలో సోమవారం పశు వైద్యశిబిరాలు నిర్వహించారు. 177 పశువులకు పరీక్షలు చేశారు. పిడుదుల నివారణ మందు పిచికారీ చేశారు. 196 దూడలు, పశువులకు నట్టల నివారణ మందు తాగించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు నంగా పద్మజారెడ్డి, స్థానిక నేత కృష్ణమనేని సావిత్రి, సర్పంచులు సునీత, చంగల్ రాయలు, డాక్టర్ వి.శ్రీధర్, డాక్టర్ జి.మోహనకుమారి, డాక్టర్ జానకమ్మ, పశుసంవర్ధక సహాయకులు కేజీఅనిల్ కుమార్, ఎస్.సరిత, పి.ఆనంద్, సి.ముని శంకర్, సుధాకర్ పాల్గొన్నారు.

మెకానిక్‌లకు చేయూత



ఆర్థిక సాయం అందిస్తున్న నేతలు

తిరుపతి కల్చరల్ : గాంధీభవన్ ఆవరణలో సోమవారం తిరుపతి టూవీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి మెకానిక్‌తో పాటు వారి కుటుంబ సభ్యులకు ఈఎస్‌ఐ సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ క్రమంలోనే అనారోగ్యంతో బాధపడుతున్న మెకానిక్‌లు పళణి, మస్తాన్‌కు రూ.10వేల చొప్పున పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం నేతలు జలంధర్, లక్ష్మణరావు, ప్రభు, బాబు, గురునాథ్ ఆచారి, సోముశేఖర్, కేశవ, పాపయ్య పాల్గొన్నారు.

అభినవతరం.. అవధానం



సంస్కృతం..తెలుగు భాష కీర్తికిరీటంలో కలికితురాయి అవధానం. మరే ఇతర భాషలోనూ ఈ విశిష్ట ప్రక్రియ ఆనవాళ్లు శూన్యం. ప్రదర్శకుడు ఎనిమిది అంశాలపై దృష్టి సారిస్తే అష్టావధానం. వంద అంశాలను ఎంపిక చేసుకుంటే శతావధానం. పురాణేతిహాలు ఔపోసన పట్టి.. అద్భుత భాషా పరిజ్ఞానం సముపార్జించిన పండితులకే ఈ పక్రియను చేపట్టడం సాధ్యం. అయితే కొందరు యువ మేధావులు అలవోకగా అవధానం సాగిస్తూ అబ్బురపరుస్తున్నారు. కఠోర దీక్షతో వ్యాకరణంపై పట్టుసాధించి క్షణాల్లో సమస్యలు పూరిస్తున్నారు. చందస్సును ఆవాహనం చేసుకుని ఆశువుగా పద్యాలను వల్లిస్తున్నారు. ఓ వైపు విద్యాభ్యాసం కొనసాగిస్తూనే.. మరో వైపు అవధానులుగా ప్రతిభను కనబరుస్తున్నారు. సాహితీ సంద్రాన్ని మధిస్తూ.. మేధో‌క్రీడలో విజయబావుటా ఎగురవేస్తున్నారు. ఉత్తమ పురస్కారాలు అందుకుంటూ.. ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారు.

- తిరుపతి సిటీ

- పిన్న వయసులో మిన్నగా రాణిస్తున్న యువత
- ఇటు చదువు.. అటు అవధానంతో ప్రతిభ చాటుతున్న మేధావులు
- ఆధ్యాత్మిక.. భాషా పరిజ్ఞానంతో అబ్బురపరుస్తున్న సాహితీ సౌరభాలు

గురువుల ప్రోత్సాహంతోనే..



మాది తిరుపతి. సంస్కృత యూనివర్సిటీలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నా. చిన్ననాటి నుంచి తల్లిదండ్రులు భగవద్గీత శ్లోకాలు నేర్పించేవారు. ఆ క్రమంలోనే పద్యాలు, కవితలపై పట్టు సాధించా. ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో ఉన్నప్పుడే 2021 ఏలూరులో తొలి అవధానం పూర్తి చేశా. ఇప్పటి వరకు 79 అష్టావధానాలు, 3 శతావధానాలు చేపట్టా. ఇందులో ఒక సంస్కృత అష్టావధానం సైతం ఉంది. 16ఏట తొలి శతావధానం పూర్తి చేసి ప్రపంచ రికార్డు సాధించా. గురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్, బ్రహ్మశ్రీ తోపెల్ల బాలసుబ్రమణ్య శర్మ ప్రోత్సాహం మరువలేనిది. శతావధాన తిలక, అవధాన బాలభాస్కర, అవధాన సవ్యసాచి, కళారంజక, బాలసరస్వతి, కళామార్తాండ, అవధాన కేసరి, విద్వన్మణి బిరుదులు అందుకున్నా. ఐదు పద్య శతకాలు రచించా. సంస్కృత, తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయడమే లక్ష్యం.

- ఉప్పలదడియం భరత్ శర్మ, శతావధాని

పదో ఏటనే తొలిసారిగా..



మాది తూర్పుగోదావరి జిల్లా. అమెరికాలో జన్మించా. హైదరాబాద్‌లో ప్రస్తుతం 8వతరగతి చదువుతున్నా. పద్యాలంటే ప్రాణం. తల్లిదండ్రులు, గురువు తోపెల్ల శర్మ ప్రోత్సాహంతో 4వతరగతిలో అహల మాట పేరుతో 108 పద్యాలు ఆటవెలదిలో రాశా. వెంకటేశ్వర స్వామి చరితను వివరిస్తూ 108 కవితలతో పద్మావతి ప్రియ శతకం రచించా. 2022లో బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ ఆధ్వర్యంలో ఏలూరులో అష్టావధానం చేశా. 2024లో గురువు తటవర్తి కల్యాణ్ చక్రవర్తి ప్రోత్సాహంతో రెండో అష్టావధానం పూర్తి చేశా. జాతీయ సంస్కృత వర్సిటీలో గురువు గంగిశెట్టి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పంచ మహా కావ్యాలు, చందస్సు, వ్యాకరణంపై కోర్సు పూర్తి చేశా. అలాగే డేటా సైన్స్, పైథాన్ ఎంట్రీ లెవల్ సర్టిఫైడ్ ప్రోగ్రామర్ సర్టిఫికెట్ అందుకున్నా. భారతీయ సంస్కృతి, సనాతన ధర్మాన్ని ప్రజలలోకి తీసుకెళ్లేందుకు కృషి చేస్తా.

- అయ్యల సోమయాజుల లక్ష్మీఅహల, అష్టావధాని

పీహెచ్‌డీ చేస్తూనే..



మాది పశ్చిమ గోదావరి జిల్లా, అత్తిలి. తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలోనే ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసి ప్రస్తుతం పీహెచ్‌డీ చేస్తున్నా. చిన్ననాటి నుంచి సంస్కృతం, తెలుగు భాషపై ప్రత్యేక ఆసక్తి ఉండేది. కవితలు, పద్యాలంటే ప్రాణం. భగవద్గీత శ్లోకాలపై ప్రత్యేక శ్రద్ధ ఉండేది. వర్సిటీలో గురువుల సహకారం మరువలేది. ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న సమయంలో 16వ ఏట తొలి గీతావధానం చేశా. 2023లో హైదరాబాద్ వేదికగా తొలి అష్టావధానం పూర్తి చేశా. ఇప్పటి వరకు 36 గీతావధానాలు, 12 అష్టావధానాలను దిగ్విజయంగా చేపట్టా. మేధోశక్తికి నిదర్శనమే అవధానమని చెప్పవచ్చు. గురువుల మార్గదర్శకత్వంలో కఠోర దీక్ష, పద్య పఠనం, చందస్సు, వ్యాకరణంపై పట్టు ఉంటే అవధానిగా రాణించవచ్చు. వర్సిటీ అధ్యాపకులు గంగిశెట్టి లక్ష్మీనారాయణ ప్రోత్సాహం మరువలేనిది. ఆధునిక సమాజంలో మరింత మంది అవధానులు తయారు కావాలి. ఆధ్యాత్మిక జ్ఞానాన్ని లోకానికి అందించాలి.

- యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు, అష్టావధాని

వైద్య విద్యను అభ్యసిస్తూనే..



బీడీఎస్ ఫైనల్ ఇయర్ పూర్తి చేసి ప్రస్తుతం ఇంటర్న్‌షిప్ చేస్తున్నా. మాది కర్నూలు. తల్లిదండ్రులు ఉపాధ్యాయులు కావడంతో వారి ప్రభావం నాపై ఉంది. పదో తరగతిలో తెలుగు మాస్టర్ మధుసూదన్ ప్రోత్సాహంతో పద్యాలపై ఆసక్తి కలిగింది. గరికపాటి నరసింహారావు ప్రసంగాలు, అవధానాలు ఆసక్తిగా తిలకించేవాడిని. స్వతహాగా పద్యాలను రాయాలనే తపన ఏర్పడింది. దీంతో వ్యాకరణంపై దృష్టి సారిచా. పద్యాన్ని అల్లగలిగే సామర్థ్యం సాధించే క్రమంలో అవధానం చేయాలనే ఆకాంక్ష తలెత్తింది. తిరుపతికి చెందిన అవధాని ఆముదాల మురళి వద్ద మెలకువలు నేర్చుకున్నా. 2022 బీడీఎస్ తొలి ఏడాదిలో కర్నూలు లలితకళా పరిషత్ ఆధ్వర్యంలో తొలి అవధానం దిగ్విజయంగా పూర్తి చేశాను. ఇప్పటి వరకు 18 అష్టావధానాలు చేపట్టా. వైద్య వృత్తిలో ఉంటూనే అవధానం కొనసాగిస్తా.

- బోరెల్లి హర్ష, అష్టావధాని

ఐఐటీలో చదువుతూనే..



ఐఐటీ ఖరగ్‌పూర్‌లో బీటెక్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్నా. స్వస్థలం హైదరాబాదు. చిన్నతనం నుంచి కవితలు, పద్యాలపై మక్కువ ఉండేది. తల్లిదండ్రులు, గురువులు అన్నమరాజు ప్రభాకర్‌రావు, పద్మశ్రీ ఆశావాది ప్రకాష్‌రావు, బాలపర్తి శ్యామలానంద ప్రసాద్ ప్రోత్సాహంతో అవధానంవైపు ఆసక్తి కలిగింది. తిరుపతికి చంఎదిన అవధానులు ఆముదాల మురళి వద్ద శిష్యరికం చేసి అవధాన ప్రక్రియలో మెలకువలు నేర్చుకున్నా. 17వ ఏట 2022లో హైదరాబాద్‌లోనే తొలి అష్టావదానం పూర్తి చేశా. ప్రస్తుతం 18అష్టావధానాలు, ఒక అద్భుతావధానం విజయవంతంగా నిర్వహించా. భాషపై పట్టు సాధించే క్రమంలో కవిత్వాలు, పద్యాలు రాయాలనే తపన నాలో బలంగా ఏర్పడింది. అకడమిక్ చదువును కొనసాగిస్తూనే మరిన్ని అవధానాలు చేస్తూ సమాజంలో భారతీయ సంస్కృతి, సనాతధర్మ ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నదే సంకల్పం.

- నల్లాన్ చక్రవర్తుల సాహిత్, అష్టావధాని

బాబ్జీనాయుడు మృతికి సంతాపం



బాబ్జీ నాయుడు (ఫైల్)

చంద్రగిరి : ఐతేపల్లె సింగిల్ విండో మాజీ చైర్మన్ మేడ సాని బాబ్జీనాయుడు(62) మృతికి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌చార్జి మోహిత్‌రెడ్డి సంతాపం తెలిపారు. సోమవారం ఆయన గుండెపోటుతో మరణించిన విషయం తెలుసుకుని వారి కుటుంబానికి సానుభూతి తెలియజేశారు. బాబ్జీనాయుడు ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. మంగళవారం స్వగ్రామం అనంతగుర్రప్పగారిపల్లెలో ఆయన అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబీకులు వెల్లడించారు.

కక్షగట్టి ఇల్లు కూల్చివేత



తిరుపతి మంగళం : వెంకటరెడ్డికాలనీలో 25 ఏళ్లుగా అన్ని పన్నులు చెల్లిస్తున్నా, సక్రమంగా అన్ని పత్రాలు ఉన్నప్పటికీ కక్షగట్టి తన ఇంటిని కూల్చివేశారని వైఎస్సార్‌సీపీ నేత తాతారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి నేతల ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు సోమవారం అక్రమంగా కూల్చివేతకు పాల్పడ్డారని వాపోయారు. ఎలాంటి విచారణ, ముందస్తు సమాచారం లేకుండా ఇంటిని కూలదోయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. రేకుల షెడ్ నిర్మించుకునేప్పుడు సచివాయల సిబ్బంది వచ్చి రికార్డులు పరిశీలించి వెళ్లిపోయారన్నారు. తీరా నిర్మాణం పూర్తయిన తర్వాత రెవెన్యూ అధికారులు వచ్చి కూల్చేశారని మండిపడ్డారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

బీసీఎం స్కూల్ విద్యార్థుల విజయకేతనం



విజేతలుగా నిలిచిన విద్యార్థులు

తిరుపతి మంగళం: మంగళంలోని బాలచంద్ర మెమోరియల్ హై స్కూల్ విద్యార్థులు 'ఇండో–నేపాల్ జంప్ రోప్ చాంపియన్ షిప్'లో విజయ ఢంకా మోగించారు. ఈ నెల 7 నుంచి 8వ తేదీ వరకు నేపాల్‌లో జరిగిన పోటీల్లో అండర్–19 ఫ్రీ స్టైల్ విభాగంలో కె.లాస్య బంగారు పతకం సాధించింది. అండర్ –14 ఎల్‌ఆర్‌ఎస్ విభాగంలో వి.వేదశ్రీ, యం.దినేష్, టీఆర్.మోనీష్, అండర్ –14 ఎన్‌డూర్‌ఎన్స్ విభాగంలో ఆర్.హరిప్రియ బంగారు పతకం సాధించింది. ఆ స్కూల్ వ్యవస్థాపకులు కృష్ణమూర్తి నాయుడు వారిని ప్రత్యేకంగా అభినందించారు.

అభివృద్ధికి దూరంగా దళితులు

తిరుపతి కల్చరల్ : రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను సమగ్రంగా అమలు చేయకపోవడం వల్లే దళితులు అభివృద్ధికి దూరంగా మిగిలిపోయారని దళిత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి. చంద్రశేఖర్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. కులగణన చేపట్టిన తర్వాతే వర్గీకరణ చేయాలని కోరారు. మంగళవారం చిత్తూరులోని నాగయ్య కళాక్షేత్రానికి విచ్చేసి ఏకసభ్య కమిషన్‌కు దళితులు తరలివచ్చి వర్గీకరణపై తమ అభిప్రాయాలతో కూడిన వినతులు సమర్పించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నేతలు ఆంజనేయులు, గోపాలయ్య, దేవేంద్ర, గోపి పాల్గొన్నారు.

పాకాల : కుల గుణన ఆధారంగా జనాభా నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలని డీఎస్‌ఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు పున్నాగు చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కుల గణన చేయకుండా వర్గీకరణకు వీలు లేదన్నారు. ఏక సభ్య కమిషన్ సమావేశానికి అందరూ హాజరు కావాలని కోరారు.


రుయాలో వెలెనెస్ సెంటర్ ప్రారంభం



మాట్లాడుతున్న వైద్యాధికారులు

తిరుపతి తుడా: రుయా ఆస్పత్రిలో నూతన వెలెనెస్ సెంటర్‌ను ఎస్వీ వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పీఏ చంద్రశేఖరన్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జీ.రవిప్రభు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ వ్యాధులను ముందుగా గుర్తించడం, నివారణ చర్యలు చేపట్టడం, దీర్ఘకాలిక వ్యాధుల నిర్వహణ, ఫిట్‌నెస్, వ్యాయామం, మానసిక ఒత్తిడి నివారణ, వ్యాధులకు ప్రత్యామ్నాయ చికిత్సలు, పోషకాహారంపై అవగాహన వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించండంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.

చైల్డ్ ట్రాన్స్‌పోర్ట్ వెహికల్ ప్రారంభం



వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి అర్బన్: ఎన్‌హెచ్‌ఎం, ఆర్‌బీఎస్‌కే సంయుక్తంగా ఏర్పాటు చేసిన చైల్డ్ ట్రాన్స్‌పోర్ట్ వెహికల్‌ను సోమవారం కలెక్టరేట్ వద్ద జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ బాలకృష్ణ నాయక్, డీపీఎంఓ శ్రీనివాస రావు, జిల్లా సర్వేలైన్స్ అధికారి హరిత, ఆర్‌బీఎస్‌కే అధికారిణి పద్మావతి వైద్యాధికారులు గుణశేఖర్ అంహీగ్నా పాల్గొన్నారు.

హిందీ భాషాభివృద్ధిపై దృష్టి

తిరుపతి సిటీ: పార్లమెంటరీ అధికార భాష కమిటీ కన్వీనర్ డాక్టర్ దినేష్ శర్మతో జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి సోమవారం వర్సటీలో సమావేశమయ్యారు. వర్సిటీ ఇక నుంచి హిందీ భాషాభివృద్ధిపై దృష్టి సారించాలని కన్వీనర్ వీసీకి సూచించారు.



అధికార భాషా కమిటీ కన్వీనర్‌తో వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి

స్విమ్స్‌లో ఉచిత వైద్యానికి డిమాండ్



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నేతలు

తిరుపతి కల్చరల్ : స్విమ్స్‌లో పేదలకు ఉచితంగా వైద్యసేవలు అందించాలని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ డిమాండ్ చేశారు. సోమవారం టీటీడీ ఏడీ బిల్డింగ్ ఎదుట కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. చింతా మోహన్ మాట్లాడుతూ రుయాలో గుండె జబ్బుల విభాగం ఏర్పాటు చేయాలని కోరారు. అలిపిరి నుంచి పేరూరు వరకు సుమారు 400 ఎకరాల టీటీడీ భూములున్నాయని, వాటిలోనే టీటీడీ ఉద్యోగులు, అర్చకులు, జర్నలిస్ట్‌లకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. ఈ మేరకు టీటీడీ ఈఓ, అదనపు ఈఓ చర్యలు చేపట్టాలని సూచించారు. కాంగ్రెస్ నేతలు యార్లపల్లి గోపి, రవి, తేజోవతి, మునిశోభ, వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు.

అటానమస్ హోదాలో తొలి ఫలితం

– మొదటి సెమిస్టర్ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ : టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ, ఎస్‌జీఎస్ ఆర్ట్స్, ఎస్పీడబ్ల్యూ డిగ్రీ కళాశాలల్లో డిసెంబర్‌లో జరిగిన డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలు సోమవారం విడుదల చేశారు. అటానమస్ హోదా పొందిన మూడు డిగ్రీ కళాశాలల్లో తొలిసారి పరీక్షలు నిర్వహించి 20 రోజుల్లో ఫలితాలు విడుదల చేయడం గమనార్హం.

ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో..

అటానమస్ హోదా పొందిన తర్వాత తొలిసారి డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్ష నిర్వహించిన ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో 1,010 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. వారిలో 838 మంది పాసయ్యారని, 83 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.

పద్మావతి కళాశాలలో..

పద్మావతి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షకు 1,086 మంది విద్యార్థులు హాజరుకాగా 878 మంది పాసయ్యారని, 81 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ టి నారాయణమ్మ తెలిపారు. అటానమస్ హోదాలో తొలి అడుగును దిగ్విజయంగా పూర్తి చేశామన్నారు. ఇందులో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ విద్యుల్లత, డాక్టర్ భద్రమణి కృషి అభినందనీయమన్నారు.



ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపల్

ఎస్‌జీఎస్ కళాశాలలో..

అటానమస్ హోదా సాధించిన ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో తొలిసారి జరిగిన డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలకు 651 మంది విద్యార్థుల హాజరుకాగా 579 మంది ఉత్తీర్ణులైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ బి సత్యనారాయణ తెలిపారు. 88.90 శాతం ఉత్తీర్ణత సాధించామని తెలిపారు. 20 రోజుల్లోనే ఫలితాలు విడుదల చేయడంలో ఎనలేని కృషి చేసిన అధ్యాపకులు, సిబ్బందిని అభినందించారు.

త్వరితగతిన వినతుల పరిష్కారం

తిరుపతి తుడా : వివిధ సమస్యలపై ప్రజలు అందించే వినతులను త్వరితగతిన పరిష్కరించాలని కార్పొరేషన్ కమిషనర్ మౌర్య ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఫోన్ ద్వారా 10, నేరుగా 40 అర్జీలు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఆయా వినతులను సంబంధిత విభాగాలకు పంపినట్లు వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈలు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ అధికారులు సేతు మాధవ్, రవి, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర పాల్గొన్నారు

అభివృద్ధి పనులు వేగవంతం

స్మార్ట్ సిటీ నిధులతో నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని కమిషనర్ మౌర్య స్పష్టం చేశారు. సిటీ ఆపరేషన్ సెంటర్(నగర పాలక సంస్థ కార్యాలయం), మల్టీలెవల్ కార్ పార్కింగ్, గరుడ వారధి సుందరీకరణ, మురుగునీటి కాలువలు, వినాయక సాగర్ వద్ద పెండింగ్ లో ఉన్న కూరగాయల మార్కెట్, స్విమ్మింగ్ పూల్ పనులను ఆమె పరిశీలించారు.స్మార్ట్ సిటీ ఈఈ చంద్రశేఖర్ పాల్గొన్నారు.